అందని సర్కార్ వైద్యం!


30 పడకల సామాజిక ఆస్పత్రి

- ఇచ్ఛాపురం 30 పడకల ఆస్పత్రిలో సిబ్బంది కొరత
- ఇద్దరు వైద్యులతోనే సేవలు
- ప్రసూతి సెలవుల్లో ఇద్దరు వైద్యులు

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం నడిబొడ్డున ఉన్న 30 పడకల సామాజిక ఆస్పత్రిలో వైద్యం సక్రమంగా అందని పరిస్థితి నెలకుంది. ఆంధ్రప్రదేశ్‌కు తొలి అసెంబ్లీ నియోజకవర్గం ఇచ్ఛాపురం. ఇక్కడ నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బెందాళం అశోక్ కూడా వైద్యుడే కావడంతో ప్రజలకు అందించే వైద్య సేవల్లో తిరుగులేదు అనుకుంటే తప్పులో కాలేసినట్లే. సామాజిక ఆస్పత్రిపై నూతన ప్రభుత్వానికి పట్టింపే లేకుండా పోయింది. రోజుకు 150 నుంచి 170 మంది వరకు రోగులు వచ్చే ఈ ఆస్పత్రికి డెంటల్ వైద్యునితో కలిపి ఎనిమిది మంది వైద్యులు ఉండాలి. అయితే కేవలం ఇద్దరు మాత్రమే సేవలు అందిస్తున్నారు. దీంతో సరైన సమయంలో వైద్య సేవలకు నోచుకోని రోగులు పక్కనే ఉన్న బరంపురం, సోంపేట, పలాస వంటి ప్రాంతాల్లోని ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు.

ఇద్దరు వైద్యులే దిక్కు..

నెల క్రితం వరకు సూపరింటెండెంట్, సివిల్ అసిస్టెంట్ సర్జన్ పి.దేవేంద్రరెడ్డి, చిన్నపిల్లల వైద్య నిపుణులు టి.శిల్ప, ప్రసూతి వైద్యురాలు అనూష, జనరల్ సర్జన్ గౌతమీ, డెంటల్ వైద్యులు బలగ రమేష్‌నాయుడులు వైద్య సేవలు అందించేవారు. నెల క్రితం అనూష, గౌతమీలు ప్రసూతి సెలవులపై వెళ్లిపోగా, డెంటల్ వైద్యుడు రమేష్‌నాయుడు నరసన్నపేటకు డిప్యుటేషన్‌పై వెళ్లిపోయారు. దీంతో సూపరింటెండెంట్ పి.దేవేంద్రరెడ్డి, శిల్పాలు మాత్రమే మిగిలారు.


డాక్టర్ దేవేంద్రరెడ్డి చుట్టూ చేరిన రోగులు

సీజనల్ వ్యాధులతో కిటకిట

డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలాయి. ఈ వ్యాధులతో ఇచ్ఛాపురం మున్సిపాలిటీతో పాటు ఇచ్ఛాపురం మండలం, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వందలాది మంది రోగులతో ఆస్పత్రి కిటకిటలాడిపోతుంది. అయితే ఉన్నది ఇద్దరు వైద్యులే కావడంతో గంటల తరబడి రోగులు నిరీక్షించాల్సి వస్తోంది. స్థానిక 16వ నంబర్ జాతీయ రహదారికి ఆనుకొని ఆస్పత్రి ఉండటంతో రాత్రి సమయాల్లో రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయాల్లో క్షతగాత్రులను ఈ ఆస్పత్రిలో చేర్పించేందుకు సైతం అంబులెన్స్ సిబ్బంది జంకుతుంటారు.


ఆస్పత్రి వద్ద పడిగాపులు కాస్తున్న రోగులు

సాధారణ కాన్పులకే అనుమతి

నెలకు పది నుంచి 15 వరకు ప్రసవాలు జరిగే ఈ ఆస్పత్రిలో ఇప్పుడు నాలుగైదు మాత్రమే జరుగుతున్నాయని సిబ్బంది చెబుతున్నారు. అందులో రిస్క్ లేకుండా సాధారణ కాన్పులకు అవకాశం ఉన్నవారిని మాత్రమే చేర్చుకుంటున్నారు. ఆపరేషన్ చేసేందుకు గైనకాలిజిస్ట్ వైద్యులు లేకపోవడంతో పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణులను తప్పని పరిస్థితుల్లో వేరే ఆస్పత్రులకు వెళ్లిపోవాలని సిబ్బంది సూచిస్తున్నారని బాధితులు చెబుతున్నారు.

రోగుల తాకిడి అధికంగా ఉంది



ప్రస్తుతం సీజనల్ వ్యాధుల కాలం కావడంతో రోగుల తాకిడి అధికంగా ఉంది. ప్రస్తుతం ఇద్దరం మాత్రమే రోగులకు సేవలు అందిస్తున్నాం. గైనకాలజిస్ట్, జనరల్ సర్జన్ వైద్యురాళ్లు ప్రసూతి సెలవులో ఉండటంతో తప్పని పరిస్థితుల్లో సాధారణ కాన్పులు మాత్రమే చేయగలుతున్నాం. అదనంగా ఇద్దరు వైద్యులు అవసరం ఉంది.

– డాక్టర్ పి.దేవేంద్రరెడ్డి, సూపరింటెండెంట్, ఇచ్ఛాపురం సీహెచ్‌సీ

ఒక్కరే అందుబాటులో ఉన్నారు



ఈ రోజు (25-07-24) ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వైద్యం కోసం వేచి చూడాల్సి వచ్చింది. డాక్టర్ దేవేంద్రరెడ్డి ఒక్కరు మాత్రమే ఉన్నారు. మరో డాక్టర్ రెస్ట్ తీసుకుంటున్నారని చెప్పడంతో రోగులంతా ఇబ్బందులు పడ్డారు.

– ఎల్.నారాయణరావు, రోగి, ఇచ్ఛాపురం

చాలా దూరం నుంచి వచ్చా



మాది కవిటి మండలం కమశాయిపుట్టుగ. నాలుగు రోజులుగా ఆరోగ్యం బాగోలేదు. డాక్టర్‌కు చూపించుకుందామని చాలా దూరం నుంచి ఇచ్ఛాపురం పెద్దాస్పత్రికి వచ్చాను. రోగులు ఎక్కువ..డాక్టర్లు తక్కువ ఉన్నారు.

– ఇసురు రాములమ్మ, కమశాయిపుట్టుగ, కవిటి మండలం

క్లుప్తంగా

547 ఆధార్ కార్డులు అప్‌డేట్


ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న వైకుంఠరావు

పలాస: పలాస మండలంలోని 16 గ్రామ సచివాలయాల్లో మొత్తం 547 ఆధార్ కార్డులను నవీకరణ చేశామని ఎంపీడీవో మెట్ట వైకుంఠరావు చెప్పారు. రెంటికోట గ్రామ సచివాలయంలోని ఆధార్ కేంద్రాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఐదేళ్లలోపు చిన్నారులకు, 17 ఏళ్ల తర్వాత గల వారికి ఆధార్‌కార్డుల నమోదు, అప్‌గ్రేడేషన్ తదితర కార్యక్రమాలను సచివాలయం సిబ్బంది చేపట్టారన్నారు. శనివారంతో ఈ కార్యక్రమం ముగిసిందని చెప్పారు. స్థానిక సర్పంచ్ తిరుమలరావు, పంచాయతీ కార్యదర్శి సద్గుణ ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత


సాయాన్ని అందజేస్తున్న రేషన్ డీలర్లు

సంతబొమ్మాళి: ఆకాశలక్కవరం రేషన్ డీలర్ కె.సింహాచలం ఇటీవల మృతి చెందారు. దీంతో అతని కుటుంబానికి సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండల రేషన్ డీలర్లు అండగా నిలిచారు. రూ. 62,300 సేకరించారు. ఈ మొత్తాన్ని సింహాచలం కుటుంబ సభ్యులకు శనివారం అందజేశారు. డీలర్ మృతికి సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో ఎ.రామారావు, కె.చిట్టయ్య, పి.వి.రమణ, భోగిరాజు, యు.లక్ష్మి, డి.రామారావు, పి.అప్పారావు ఉన్నారు.

సర్వే వేగవంతం చేయాలి


సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

నందిగాం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న బహిరంగ మలవిసర్జన రహిత గ్రామసర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీఓ టి.రాజారావు అన్నారు. బడగాం పంచాయతీలో శనివారం జిల్లా పంచాయతీ వనరులకేంద్రం జిల్లా రిసోర్స్‌పర్సన్ పేరాడ ఆనందరావుతో కలిసి సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండలంలోని అన్ని పంచాయతీల్లో సర్వే ప్రారంభమైందని.. దీన్ని మరింత వేగవంతం చేయాలని సూచించారు. పరిశీలనలో ఎంఆర్‌సీ రాంబాబు ఉన్నారు.

కేజీబీవీ పరిశీలన


సిబ్బందికి సూచనలిస్తున్న అధికారులు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళిలోని కేజీబీవీని అధికారులు శనివారం పరిశీలించారు. ఇంటర్ విద్యార్థిని పూజ గురువారం ప్రమాదవశాత్తు భవనం పైనుంచి జారిపడి గాయపడిన నేపథ్యంలో ఎంఈవోలు ఎస్.అప్పలరాజు, ఎల్.విశ్వప్రతాప్ శనివారం పాఠశాలకు వెళ్లి ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. సిబ్బంది, విద్యార్థుల నుంచి వివరాలు సేకరించారు. సిబ్బందికి పలుసూచనలు చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని సిబ్బందికి ఆదేశించారు.

బదిలీ ఉద్యోగికి సత్కారం

కాశీబుగ్గ: పలాస ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్లిన సూర్యనారాయణను కార్యాలయ సిబ్బంది శనివారం సత్కరించారు. ఆర్డీవో భరత్‌నాయక్ దుశ్శాలువతో సూర్యనారాయణను సత్కరించి గౌరవించారు. కార్యక్రమంలో డీటీలు, ఇతర ఉద్యోగులు జీవనరావు, వెంకటేశ్వరరావు, నారాయణ, తరుణమ్మ, సంతోష్, నిఖిల్, దిలీప్ ఉన్నారు. అలాగే బదిలీపై వెళ్లిన ఎస్ఎస్‌వీఎస్ నాయుడును తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది సత్కరించారు.

భోజనం పరిశీలన

ఇచ్ఛాపురం: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల విద్యాశాఖాధికారి కె.అప్పారావు మధ్యాహ్నభోజనం నిర్వాహకులకు సూచించారు. పట్టణంలోని ప్రభుత్వోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకాన్ని శనివారం పరిశీలించారు. విద్యార్థుల కోసం సిద్ధం చేసిన భోజనాన్ని రుచి చూశారు. హెచ్ఎం ఎస్.విశ్వనాథం, ఎన్‌సీసీ అధికారి ప్రసన్నకుమార్ ఉన్నారు.

టి.బరంపురంలో ఉచిత వైద్య శిబిరం

ఇచ్ఛాపురం రూరల్: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఎంపీపీ బోర పుష్ప అన్నారు. మండలం టి.బరంపురం గ్రామంలో శనివారం జెమ్స్ రాగోలు ఆస్పత్రి సౌజన్యంతో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. 130 మంది రోగులకు ఈసీజీ, రక్త పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు.

అబ్దుల్ కలామ్‌కు ఘనంగా నివాళి


పలాస: కలామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం


కాశీబుగ్గ: కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు, నాయకులు

పలాస: దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలామ్‌ను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని వక్తలు అన్నారు. పలాస మండలం లొద్దబద్ర ఎంపీయూపీ స్కూల్‌లో కలామ్ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి ప్రధానోపాధ్యాయుడు గొర్లె నాగేశ్వరరావు, విద్యార్థులు పూలమాల వేసి నివాళులర్పించారు. కలామ్ జీవిత విశేషాలను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు.

కాశీబుగ్గ: బీజేపీ రాష్ట్ర మైనారిటీ అధ్యక్షులు షేక్ బాజీ ఆధ్వర్యంలో స్థానిక ఇందిరాగాంధీ చౌక్ వద్ద అబ్దుల్‌కలామ్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. జిల్లా మైనారిటీ అధ్యక్షులు ఎండీ ఫైయజ్ అహ్మద్ ఘని ఆధ్వర్యంలో కలామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. సీనియర్ న్యాయవాది బి.కె.ఆర్.పట్నాయక్, న్యాయవాదులు చంద్రశేఖర్‌రావు, రజినీకాంత్, రవికుమార్ పట్నాయక్, పీసీఎంఏ అధ్యక్షులు మల్లా సురేష్, ఏపీఎన్‌జీవో అధ్యక్షులు బోనెల గోపాల్, టీడీపీ నాయకులు దడియాల నరసింహులు, జనసేన నాయకుడు చిట్టిబాబు, బీజేపీ పట్టణ నాయకులు వైశ్యరాజు రాజు, సురేష్, యువకులు పాల్గొన్నారు.

దోమల నివారణపై దృష్టి పెట్టండి

- మున్సిపల్ చైర్మన్ గిరిబాబు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో దోమల నివారణపై అధికారులు దృష్టిసారించాలని మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు అన్నారు. మెప్మా విభాగంలో శనివారం పట్టణ మహిళా సమైక్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమైఖ్యల విధి విధానాలు, ప్రతినెల అంతర్గత అప్పులు, పొదుపులు సక్రమంగా కట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 31 వార్డుల్లో పారిశుద్ధ్యం, దోమల నివారణపై అధికారులకు సూచనలు చేశారు. మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్, సిటీ మిషన్ మేనేజర్ పి.మోహనరెడ్డి, ఐబీ బి.రాము, ఐటీ విభాగానికి చెందిన రమేష్, సీవో స్వప్నకుమారి, డీఈవో విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం

టెక్కలి: యువత మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారితే వారి జీవితాలు సర్వ నాశనమవుతాయని టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌హెచ్‌ఆర్ తేజ చక్రవర్తి మల్ల అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్ప్రయోజనాలపై శనివారం స్థానిక ఎస్‌వీఆర్‌కే కళాశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యంగా యువత సెల్‌ఫోన్ ప్రభావంతో చెడు వ్యసనాలకు దగ్గరవుతున్నారని పేర్కొన్నారు. ఇందులో మత్తు పదార్థాలను వినియోగించి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని.. కొన్ని సందర్భాల్లో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని జడ్జి చక్రవర్తి ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.వివేకానంద, ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు, కళాశాల కరస్పాండెంట్ ఎ.ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎం.మోహన్‌రావు పాల్గొన్నారు.


టెక్కలి: మాట్లాడుతున్న జడ్జి ఎస్‌హెచ్‌ఆర్ తేజ చక్రవర్తి మల్ల

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం


మొక్కలు నాటుతున్న సొసైటీ ప్రతినిధులు

వజ్రపుకొత్తూరు: పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలని ఉద్దానం హెల్పింగ్ సొసైటీ అధ్యక్షుడు కీలు విజయ్‌కుమార్ అన్నారు. పెద్దమురరిపురం, నూకలవానిపేట, తేరపల్లి, గర్తంవానిపేట, తామాడ వానిపేట, పల్లివూరు తదితర గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా 150 మొక్కలు నాటినట్లు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మొక్కల పెంపకంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. చెట్లు అనవసరంగా నరికివేయడం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని అన్నారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు బి.తిరుపతిరావు, కె.చంటి, ప్రకాష్, పుష్ప, అజయ్, మాధవరావు, రవి, ఆయా గ్రామాల యువత పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

- కాశీబుగ్గ రూరల్ సీఐ ఈశ్వరరావు

వజ్రపుకొత్తూరు: మైనర్లు వాహనాలు నడిపితే కఠినంగా వ్యవహరిస్తామని, ఇది వారి తల్లిదండ్రులు గమనించాలని కాశీబుగ్గ రూరల్ సీఐ పి.ఈశ్వరరావు హెచ్చరించారు. పూండిలని సాయి వినీత్ విద్యా సంస్థల్లో ఇంటర్, డిగ్రీ చదువుతున్న కళాశాల విద్యార్థులకు స్థానిక ఎస్ఐ చామంతుల రామారావు అధ్యక్షతన వివిధ అంశాలపై శనివారం అవగాహన కల్పించారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలు, డ్రగ్స్ జోలికి పోయి బంగారం లాంటి ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దని సూచించారు. పెద్దలు హెల్మెట్ ధరించి వాహనం నడపాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అన్నెపు కైలాషరావు, వైస్ ప్రిన్సిపాల్ బత్తిన శ్రీనివాసరావు, అధ్యాపకులు బి.గణేష్, ఎస్.షణ్ముఖరావు ఉన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ ఈశ్వరరావు

సంక్షిప్తంగా..

ఆరోగ్యవంతమైన సమాజాన్ని అందిద్దాం


మొక్కలు అందజేస్తున్న ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు

సోంపేట: భావితరాలకు ఆరోగ్యవంతమైన సమాజాన్ని అందించడానికి మొక్కలు నాటుదామని ఎస్ఎస్ సేవా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో బారువ ప్రభుత్వ డిగ్రీకళాశాలకు 100 మొక్కలను శనివారం అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.రామారావు, వైస్‌ప్రిన్సిపాల్ రామకృష్ణ, సేవా ఫౌండేషన్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

సోంపేట: బేసిరామచంద్రాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో రాణించి మంచిపేరు తీసుకురావాలని విద్యాశాఖాధికారులు ఎస్.జొరాడు, జె.కృష్ణంరాజు అన్నారు. ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ పోటీల్లో డ్రాయింగ్ విభాగంలో రాష్ట్రస్థాయి ప్రథమ స్థానం సాధించిన పాఠశాలకు చెందిన విద్యార్థి బి.కృష్ణమూర్తికి ప్రశంసా పత్రం, నగదు, జ్ఞాపికను శనివారం అందజేసి అభినందించారు. హెచ్ఎం చంద్రశేఖర్‌రావు పట్నాయక్, జామి సాయిరాజు ఉన్నారు.

భగవద్గీత పఠనం అలవర్చుకోవాలి

సోంపేట: విద్యార్థి దశనుంచే భగవద్గీత పఠనం అలవాటు చేసుకుంటే మంచి వ్యక్తిత్వం అలవడుతోందని మనోవికాస నిపుణులు, జాగృతి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రాంబుడ్డి గణపతి అన్నారు. పాలవలస పంచాయతీ కుమ్మరిపాడు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు సూరి కిరణ్‌కుమార్, సంస్థ ప్రతినిధులు ఉన్నారు.

నేడు ఏపీయూడబ్ల్యూజే జిల్లా మహాసభలు

కాశీబుగ్గ: పలాస వేదికగా ఆదివారం ఉదయం పలాసలోని కీర్తన ఫంక్షన్ హాల్‌లో శ్రీకాకుళం జిల్లా 31వ ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (ఏపీయూడబ్ల్యూజే) జిల్లా మహాసభలు జరగనున్నాయి. ఈ విషయాన్ని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.మహారణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు వజ్రపుకొత్తూరు మండల సమావేశం

వజ్రపుకొత్తూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం ఉదయం పది గంటలకు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో డిక్కల తిరుమలరావు శనివారం తెలిపారు. ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి అధ్యక్షతన జరగనున్న సమావేశానికి సభ్యులు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

నేడు ఐటీఐ రెండో విడత కౌన్సెలింగ్

కాశీబుగ్గ: పలాస డాక్టర్ కణితీష్ ప్రభుత్వ ఐటీఐలో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పైల జవహార్ తెలిపారు. అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

30న మున్సిపల్ సమావేశం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 30వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ తెలిపారు. మున్సిపల్ చైర్మన్ బి.గిరిబాబు అధ్యక్షతన జరగనున్న సమావేశానికి సభ్యులు హాజరు కావాలని కోరారు.

నీలంపేటలో ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ మేళా

కోటబొమ్మాళి: నీలంపేట గ్రామంలో స్థానిక రైతు రక్తం తులసీదాస్ పొలంలో శనివారం ఉద్యానవన శాఖాధికారి కె.సునీత ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ మేళా నిర్వహించారు. ఉద్యానవన విస్తరణాధికారి జి.సంధ్య, సచివాలయ సిబ్బంది కళ్యాణి, శశికుమార్ ఉన్నారు.

ఉత్సాహంగా గ్రీన్ కోర్ ఎకో డే


కాశీబుగ్గ:మందస మండలం కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలలో..


కాశీబుగ్గ:పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..


కాశీబుగ్గ:కాశీబుగ్గ సాయికాలనీ ఎంపీయూపీ పాఠశాలలో..


కాశీబుగ్గ:లొద్దబద్ర ఎంపీపీ పాఠశాలలో..


వజ్రపుకొత్తూరు రూరల్: నగరంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


నందిగాం: పెద్దతామరాపల్లిలో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

పాఠశాలల్లో కొద్దిరోజులుగా నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. ఇందులో భాగంగా శనివారం గ్రీన్ కోర్ ఎకో డేను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలు, కళాశాలల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. నాటిన మొక్కలను సంరక్షించాలని విద్యార్థులకు సూచించారు.


ఇచ్ఛాపురం రూరల్: మండపల్లి జెడ్పీ పాఠశాలలో మొక్కలు నాటుతున్న హెచ్ఎం ప్రకాశరావు


కంచిలి: ఎస్.ఆర్.సి.పురం పాఠశాలలో మొక్కలు నాటుతున్న వ్యాపారి పూనా శ్రీకాంత్, ఎంఈవో శివరాంప్రసాద్


ఇచ్ఛాపురం రూరల్: కొళిగాం పాఠశాలలో మొక్కలు నాటుతున్న డాక్టర్ కల్యాణి, హెచ్ఎం నరేంద్రనాథ్ పట్నాయక్

ప్రాథమిక చికిత్సపై శిక్షణ

టెక్కలి: శ్వాస కోశతో బాధపడేవారికి ప్రాథమిక చికిత్స అందించే విధానంపై 108 వాహన సిబ్బందికి అవగాహన ఉండాలని జిల్లా మేనేజర్ బి.హరిప్రసాద్ సూచించారు. టెక్కలి డివిజన్ పరిధిలోని 108 వాహన సిబ్బందికి టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక చికిత్సలో సరికొత్త విధానాలపై అవగాహన చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రంగ ప్రసాద్, ఎస్.కృష్ణారావు ఉన్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న జడ్జి పరేష్‌కుమార్

ఇచ్ఛాపురం: మత్తుపదార్థాలకు యువత దూరంగా ఉండాలి జూనియర్ సివిల్‌జడ్జి పి.పరేష్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల ఆవరణలో మాదకద్రవ్యాల వినియోగంతో వాటిల్లే నష్టాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ బాగా చదువుకొని మంచి భవిష్యత్‌ను పొందాలన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీఐ ఇమ్మాన్యుయేల్‌రాజు, తహసీల్దార్ గురుప్రసాద్, డాక్టర్ వాణి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రబీన్‌కుమార్‌పాడీ, న్యాయవాదులు రంగారావు, ఎస్.రమణయ్య, కృష్ణమూర్తి, అధ్యాపక సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

టెక్కలి: అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం టెక్కలి ఎంఈవో డి.తులసీరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సమస్యలను ప్రస్తావించారు. అనంతరం పోలవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ ఇటీవల మృతి చెందిన సుభాషిని ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ సంతాపాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కె.దాలయ్య, పి.గణపతిరావు, టి.వైకుంఠరావు, ఆర్.విజయ్‌కుమార్, పి.ధర్మారావు, ఎల్.నరేష్, బి.ఖగేశ్వరరావు, బి.నారాయణరావు, శ్రీధర్, చిన్నవాడు ఉన్నారు.